# రైల్వే సుందరి

భీమవరం స్టేషన్‌లో రైలు దిగేసరికి గంట లేటు. చరచర స్నాన పానాదులు ముగించుకుని సభలోకి వెళ్ళేసరికి ఉదయం తొమ్మిది అయింది. సభ ప్రారంభమై జరుగుతోంది. సభాధ్యక్షులు మల్లాది రామమూర్తి శాస్త్రి గారు. శాస్త్రిగారు మంచి ఆయుర్వేద వైద్యులు - అటు వసంత కుసుమా కరాన్ని ఎంత పసందుగా తయారుచెయ్యగలరో, ఇటు ఉత్తరరామ చరిత్ర రసనిర్ణయం అంత అధికారికంగా నిర్వహించగలరు.

ఎంత సాహిత్య ప్రియులో అంత మంచి వక్త!

సభలో అడుగుపెట్టేసరికి శ్రీనివాసరావు, శ్రీశ్రీ, విశ్వేశ్వరరావు, రుక్మిణీనాథం ఖణాయించి కూర్చున్నారు. వాళ్ళను చూడగానే ప్రాణంలేచి వచ్చింది. రాత్రి రైల్లో నిద్రలేని బద్ధకం అంతా పటాపంచలై ఉత్సాహం పొంగుకొచ్చింది.

రుక్మిణీనాథం హఠాత్తుగా లేచొచ్చి కౌగిలించుకున్నాడు. బాపిరాజు గారు అటు- ఎక్కడినుంచో రావడంచేత, అతిథి ఇటు ఆ వూరి వాడవడం చేత అతిథేయుడూ అయి, రెండు హోదాల్లో హుషారుగా తిరుగుతున్నారు.

పుత్తడి బొమ్మలాంటి 14 ఏళ్ళ చిన్నది హార్మోనియంమీద 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' పాట పాడుతోంది. ఆ పిల్లలో 'పూజారింటను పుట్టిన చిన్నదాన్ని' ఊహించుకుని కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి. తర్వాత ఒకటి రెండు ప్రసంగాలు జరిగాయి. అధ్యక్షోపన్యాసం ఒక గంట సాగి ఆ పూట సభ ముగిసింది.

సారస్వత సమాజం వార్షిక సభలు—

కార్యదర్శి సూర్యనారాయణమూర్తిగారింట్లో ఆతిథ్యం.

అంతా చేరి పద్యం—గేయం - కవిత్వం, నాటకం—ఒకటేమిటి— సర్వ సారస్వత శాఖల మీదా— ఆ కవి ముఖాన — మరీ తీవ్రంగా చర్చిస్తున్నాం. హాల్లోపదార్థాల సువాసన తగిలేకొద్దీ, మాలో రసజ్ఞత పెరిగి పోతోంది.

పిలుపు వచ్చింది. భోజనా లవుతున్నాయి.

భోజనాల్లో గోదావరీవైభవం,వైవిధ్యం, సురుచీ, స్పష్టంగా పరుచుకుని కనిపిస్తున్నాయి. 'మొగి విరిసి కరకు గూడక' అని శ్రీనాథుడు వర్ణించినలాంటి అరటాకులో పదార్థాలు చవులూరిస్తున్నాయి. 'ఏద్దానిగైకొందు, ఎద్దానిన్ వీడుదునోయి చిన్నన్నృపతీ' అనాలనిపిస్తోంది.

రామ్మూర్తి శాస్త్రులుగారు స్వీటు తింటూ ప్రారంభించారు - "నేను

జైల్లో ఉన్నప్పుడు కొందరు మిత్రులు ఉపనిషత్తులు పాఠం చెప్పమంటే తరచి తరచి చెప్పాను.

ఎందుకో నామీద కసి బయలేరింది వారికి—

'మాండూక్యం'లోంచి 'ముండకం'లోకి దిగి అంతా 'కాఠకు'లై ఎదురు తిరిగారు.

ఈ ఉపనిషత్తులన్నీ తగలబెట్టాలన్నారు.

ఈ వేదాంతమే కొంపముంచిందన్నారు.

ఆశ్చర్యపడి నవ్వుకున్నాను.

ఎవరి కొంప ?

బోధించిన ఋషులదా ? బోధింపబడిన శిష్యులదా ?" అంటూ రామ్మూర్తిశాస్త్రిగారు ఆగారు.

రుక్మిణీనాథం పకపక నవ్వుతూ "ఆ ఇద్దరికీ కొంపలులేవు. ముందు మీకొంప-అపాత్రులికి బోధించి మీ పాత్ర పోగొట్టుకున్నారు."

అంతా విరగబడి నవ్వేశాం. శాస్త్రులుగారు భోజనం ముగించి—

"నిజం" అన్నారు, ముక్తసరిగా —

అంతా లేచాం.

మధ్యాహ్నం సభకు అడవి బాపిరాజుగారు అధ్యక్షులు. బాపిరాజు అందరికీ బావ, అయితే నాకు అన్న. మేమిద్దరం ఒక వూరివారి అల్లుళ్ళం.

ఆయన పుట్టరికానికి రామచంద్రపురం వస్తే - తరుచు మా యింటిదగ్గరే కాలక్షేపం.

బాపిరాజు భలోక్తులతో, గేయాలతో పట్టలేని అప్యాయతతో, మాట్లాడుతూ ఉంటే ఉపన్యాసంలా లేదు. ఆత్మబంధువుల సల్లాపంలా ఉంది. ఏ సభలోనైనా, 'వచ్చిరి ముగ్గురు సరాబులూ - ఒకడికి కాళ్ళేలేవు. ఒకడికి నోరేలేదు' అనే జానపద గేయం పాడందే ఆయన ప్రసంగం ముగిసినట్టు కాదు.

తర్వాత శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు మధ్య మధ్య వ్యాఖ్యానిస్తూ తమ గేయాలు చదివారు. విశ్వేశ్వరరావు గేయప్రియుడు. ఆయన చేతిలో అప్పుడే ప్రచురించిన 'కళ్యాణ కింకిణి' అనే గేయ సంపుటి కొత్తగా నిగ నిగలాడుతూ కనిపించింది. మంచి సౌందర్యారాధకుడు, మిత భాషి. ఆయన నడుస్తూ ఉంటే-బెంగాలీ ఒయ్యారంతో ఒక గేయం నడిచిపోతూన్నట్లుం డేది. 'శాంతిబొనేర్ గొగొన మొధుబాసనా' లాగు -

పద్మరాజు సాహిత్యరంగంలోకి కొత్తగా దిగిన రోజులు— చదివిన సైన్సును పక్కనబెట్టి జానపదరీతిలో మంచిగేయం వ్రాసుకొచ్చి చదవి నట్టు జ్ఞాపకం!

రుక్మిణీనాథం, నేనూ వరండాలో నిలబడి వింటున్నాం. అతనికి ఇల్లులేదు; వాకిలి లేదు. బ్రతుకంతా సాహిత్యమే! నేను అంతక్రితం వారం రోజులనాడు అతనికి రాసిన ఉత్తరంలోని సాహిత్యమీమాంస అంతా తుచ తప్పకుండా ఒప్ప చెబుతున్నాడు. రావణా జ్ఞాపకం! ఉత్తరా బుత్తరాలు ఒప్ప చెప్పగలడు. మావంతు వచ్చింది. వెళ్ళి నేను భవభూతిమీదా, అతడు నవ్యకవితలో సరికొత్త పోకడలమీదా మాట్లాడాము.

సభ ముగిసింది.

మరునాడు ఉదయం తిరుగు ప్రయాణాల సందడి. అంతా భీమవరం స్టేషన్‌లో చేరాం.

బాపిబావ అందరికీ పెద్ద అయి ఖులాసాగా కబుర్లు చెబుతున్నాడు. కాఫీ తాగుతున్నాం.

అంతా వున్నారు. విశ్వేశ్వర్రావు కనిపించలేదు. రుక్మిణీనాథం "విశ్వం శశ్వత్ బద్ధకస్తుడు" ఏడీ ఆయన? అంటూ వెతుకుతున్నాడు.

బాపిరాజు కొంటెతనం కదిలింది. "చూడు- రుక్మిణీనాథం! ప్లాట్ ఫారంమీద అటూ ఇటూ రెండు రైళ్ళు నిలిచి ఉన్నాయి. అందమైన అమ్మాయి ఏ రైలు బోగీలో వుంటే, అందులోనే ఎక్కిపోగలడు, చప్పున వెదుకు" అన్నాడు. కాఫీ కప్పుకేసి చూసి నవ్వుతూ - పక్కషాపులో సిగరెట్లు, ఒక ఇంగ్లీష్ మేగజిన్ కొనుక్కుని మా వెనకనే నిలుచుని ఉన్నాడు విశ్వేశ్వర్రావు. మేం చూసుకోలేదు.

ఆయన ముందుకువచ్చి అంతకన్న కొంటెగా "బాపిరాజుగారూ నేనూ ఒక్క రైలు ప్రయాణీకులమే. గుడివాడ రైల్లో- ఆ 'ముబ్బురంగు సిల్కుచీర' ఎక్కిన అయిదవ బోగీలో ప్రయాణం చెయ్యడానికే ఆయన తప్పకుండా మనస్సులో నిశ్చయించి ఉంటారు. నేనూ ఆయన అడుగు జాడల్లోనే పయనిస్తాను" అంతా ఘల్లున నవ్వులు!

బాపిరాజుగారు ఖులాసాగా, నవ్వేసి రైలు దగ్గరకి కదిలారు.